

రజతోత్సవానికి సిద్ధం

- నేడు వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ
- జన సమీకరణకు సన్నాహాలు
- జిల్లా నుంచి తరలనున్న పదివేల మంది పార్టీ శ్రేణులు



మంచిర్యాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవాలకు సిద్ధమైంది. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న భారీ బహిరంగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. తెలంగాణ ప్ర త్యేక రాష్ట్రం ఏర్పాటు తరువాత గులాబీ పార్టీ రెండు సార్లు అధికారం చేపట్టింది. మూడోసారి కూడా పీఠం ఎక్కాలనే ఉత్సాహంలో ఉన్న ఆ పార్టీకి కాంగ్రెస్ పార్టీ బ్రేకులు వేసింది. గత ఎన్నికల్లో ఓటమి పాలు కావడంతో ఇంతకాలం పాటు గులాబీ బాస్ కేసీఆర్ మౌనం వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తరువాత ఆయన తిరిగి ప్రజా క్షేత్రం లోకి వెళ్లడం ద్వారా పార్టీకి పూర్వవైభవం తెచ్చేందు కు సన్నాహాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) 2001 ఏప్రిల్ 27న ఆవిర్భవించగా, ఆదివారంతో 25 ఏళ్లు పూర్తికానున్నాయి. ఈ సందర్భంగా రజతోవాలను ఘనంగా జరపాలని నిర్ణయించారు. అందుకు వేదికగా వరంగల్‌ను ఎంచు కోగా బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ఆ పార్టీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నారు.

పదేళ్లపాటు తిరుగులేని పార్టీగా...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత 2014 ఎన్నిక ల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ 10 సీట్లకుగాను ఏడు స్థా నాల్లో గెలుపొందింది. అనంతరం 2018 ఎన్నికల్లో ఏ కంగా తొమ్మిది స్థానాలను గెలుచుకోగా, ఆసిఫాబాద్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఆత్రం సక్కు విజయం సాధించారు.

ఆ తరువాత ఆయన కూడా గులాబీ పార్టీలో చేరడంతో మొత్తం పదికి పది స్థానాల్లో పాగా వేసింది. అలా రెండు పర్యాయాలు ఉమ్మడి జిల్లాలో తిరుగులేని పార్టీగా రికార్డును సొంతం చేసు కుంది. మూడో పర్యాయం కూడా అదే ఊపుతో బరిలో దిగినప్పటికీ అనూహ్య ఓటమి ఎదురైంది. 2023 ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో మాత్రమే బీఆర్ఎస్ అభ్యర్థులు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి గెలుపొందారు.

పార్టీని వీడిన అగ్రనాయకులు...

2023 ఎన్నికల్లో రాష్ట్రంలో ఓటమి పాలైన బీఆర్ఎస్‌ను పలువురు అగ్ర నేతలు వీడారు. 2019లో పెద్దపల్లి ఎంపీగా గెలిచిన బోర్లకుంట వెంకటేశ్‌నేత 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. చెన్నూరు ఎమ్మెల్యేగా మూడు పర్యా యాలు పదవిని అలంకరించిన నల్లాల ఓదెలు కూడా పార్టీని వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఓదెలుతోపాటు ఆయన సతీమణి అప్పటి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఉన్న నల్లాల భాగ్యలక్ష్మి కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఆసిఫా బాద్ నుంచి ఆత్రం సక్కు సైతం కాంగ్రెస్‌లో చేర గా, అక్కడి మరో అగ్రనేత కోనేరు కోనప్ప కూడా కాంగ్రెస్ పంచన చేరారు. అలాగే మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాం గ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్ కూడా..

(తరువాయి 7లో)

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు



చెక్‌పోస్టు వద్ద పోలీసు, రెవెన్యూ అధికారులు

కోటపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పక్క రాష్ట్రం నుంచి ధాన్యం ఇటు వైపు రాకుండా ఉండేందుకు శనివారం మండలంలోని పారుపెల్లి వద్ద పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టు వద్ద మూడు శాఖల ఆధ్వర్యంలో 24 గంటల పాటు నిరంతరం నిఘా ఉంటుందని ఈ సందర్భంగా చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్ పేర్కొన్నారు. పక్కన ఉన్న మహారాష్ట్ర నుంచి ఇటు వైపు ధాన్యం రాకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేందర్, డిప్యూటీ తహసీల్దార్ నవీన్, ఏవో సాయికృష్ణ, గిర్దావర్ శ్రీనివాస్ పోలీసులు పాల్గొన్నారు.

చిన్నారుల ఎదుగుదలపై దృష్టి పెట్టాలి

లక్సెట్టిపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహకులు చిన్నారుల ఎదుగుదలపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలని మంచిర్యాల జిల్లా మాతా శిశు సంక్షేమశాఖ అధికారి రౌఫ్‌ఖాన్ అన్నారు. మున్సి పాలిటీలోని ఊత్కూర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను డీడబ్ల్యువో శనివారం పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు సమయ పాలన పాటించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్ పూర్తి స్థాయిలో పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఇటీవల కేంద్రాలకు ప్రభుత్వం మంజూరు చేసినటాయిలెట్స్‌తో పాటు కేంద్రాల్లో ఉన్న రికార్డులను పరిశీలించారు. సీడీపీవో రేష్మా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, ఆయా కేంద్రాల టీచర్లు ఉన్నారు.

జన్నారం: మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం మంచిర్యాల డీడబ్ల్యూవో రౌఫ్‌ఖాన్ సందర్శించారు. కేంద్రంలోని గదులను పరిశీలించారు. పూర్తిస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందిస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట లక్సెట్టిపేట సీడీపీవో రేష్మ, సూపర్ వైజర్ కవిత ఉన్నారు.

భూ భారతి చట్టం..రైతులకు వరం

కలెక్టర్ కుమార్ దీపక్



నెన్నెలలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నెన్నెల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూ భారతి చట్టం రైతులకు వరం లాంటిదని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నూతన ఆర్‌వోఆర్ చట్టం ద్వారా భూ సమస్యలన్నింటికి శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం నిర్వహించిన భూ భారతి చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ చట్టంలో పొందుపరిచిన అంశాలు, హక్కులపై ప్రతీ రైతు అవగాహన కలిగి ఉండాలన్నారు. రికార్డుల సవరణ, మ్యూటేషన్‌కు ముందే మ్యాప్ తయారు చేయడం, పాసు బుక్కులోనే భూమి పటం, భూ సమస్య పరిష్కారానికి అప్పీల్ విధానం తదితర నూతన అంశాలు ఉన్నాయన్నారు. పైలెట్ మండాల్లో జూన్ 2 వరకు, మిగతా మండలాల్లో ఆగస్టు 15 వరకు పూర్తి భూ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసు కుంటున్నామన్నారు. గ్రామ స్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు త్వరలోనే అధికారుల నియామకాన్ని ప్రభుత్వం చేపడుతుందన్నారు.

నూతన చట్టం విధి విధానాలను అధికారులు చదివి వినిపించారు. ప్రభుత్వ భూమిలో పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులను అటవీశాఖ వారు ఇబ్బందుల పాలు చేస్తున్నారని నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా జాయింట్ సర్వే చేసి సమస్యకు పరిష్కారం చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతీ లాల్, బెల్లంపల్లి ఆర్‌డీవో హరికృష్ణ, ఏడీఏ సురేఖ, తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏవో పుప్పాల సృజన, పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, కాంగ్రెస్ నాయకులు బొమ్మెన హరీష్ పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



రక్తదాన కార్యక్రమంలో తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

మంచిర్యాలక్రైం/గర్మిళ్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో శనివారం మంచిర్యాల పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లోని తపస్ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ యెగ్గెన శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవి కాలంలో రక్తం అవసరం ఉందని గుర్తించి రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. టచ్ ఆసుపత్రిలో ఎండీ ఫిజిషియన్‌గా పనిచేస్తున్న డాక్టర్ బిల్లా వికాస్ స్వచ్ఛందంగా పాల్గొని అందరికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని అభినందించారు. శిబిరంలో 37 మంది పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్లు కమ్మ చౌదరి, సత్యనారాయణమూర్తి, రాజ్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, మహేందర్, తలసేమియా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు శ్రీనివాస్, తపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, రవికుమార్ పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించండి



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న భూనిర్వాసిత రైతులు

జైపూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే 163 భూనిర్వాసిత రైతులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, కిష్టాపూర్ పెట్రోలు బంకు వద్ద ఎగ్జిట్ ఇవ్వాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు శనివారం వినతి పత్రం అందించినట్లు భూనిర్వాసితుల సంఘం నాయకులు సుందిల్ల మల్లేష్, రామారావు తెలిపారు. వారు మాట్లాడుతూ భూనిర్వాసిత రైతులు దేశాభివృద్ధి కోసం తమ భూములను హైవే రోడ్డుకు ఇస్తున్నట్లు, దీంతో ఉపాధి కోల్పోతున్నామని తెలిపారు. రోడ్డు పనుల్లో భూనిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కాంట్రాక్టర్ వేరే రాష్ట్రాల నుంచి వర్కర్లను తీసుకువచ్చి పనులను నడిపిస్తే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. కిష్టాపూర్ పెట్రోలు బంకు వద్ద ఎగ్జిట్ ఇవ్వడం వల్ల పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా ప్రజలకు వాణిజ్య అవసరాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో భూనిర్వాసిత రైతులు రాంరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కృష్ణమూర్తి, భూమయ్య, ప్రభాకర్, రాజారాం, సాగర్‌రెడ్డి, కృష్ణరెడ్డి, సమ్మయ్య పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



గూడెంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్న సంస్థ నిర్వాహకురాలు

దండేపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి అవకాశం కల్పించేందకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించనున్నట్లు గ్రామ స్వరాజ్యం సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ సంధ్యారాణి, గూడెం మాజీ ఎంపీటీసీ తోట మోహన్‌లు అన్నారు. శనివారం దండేపల్లి మండలం గూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఎస్‌బీఐ బ్యాంకు సౌజన్యంతో గ్రామ స్వరాజ్యం సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని గ్రామీణ ప్రాంత మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ ఇస్తామన్నారు సంస్థల వాలంటీర్ల, ట్రైనర్ ఎం అశ్విని తెలిపారు.

సీసీ కెమెరాలతో మరింత నిఘా

కోటపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సీసీ కెమెరాల ఏర్పాటుతో మరింత నిఘాను పటిష్ఠం చేసుకోవచ్చని ఎస్ఐ రాజేందర్ అన్నారు. మండలంలోని దేవులవాడ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నేను సైతం కార్యక్రమంలో 7సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కెమెరాల ఏర్పాటుతో పాఠశాల చుట్టు పక్కల భద్రతను మరింత పటిష్ఠ పర్చుకోవచ్చన్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సెల్ టవర్‌ను తొలగించాలని ధర్నా

నస్పూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని అభినవ కాలనీలో ఏర్పాటు చేసిన సెల్ టవర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం నస్పూ ర్‌లోని కలెక్టరేట్ ఎదుట కాలనీ వాసులు ధర్నాకు చేశారు. కాలనీ వాసులు ప్లే కార్డులు పట్టుకుని సెల్ టవర్‌ను తొలగించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో ఏర్పాటు చేసిన సెల్ టవర్ కారణంగా రేడియేషన్‌తో చుట్టూ నివాసాల ప్రజల నానా ఇబ్బందులకు గురైయ్యే ప్రమాదం ఉన్నదన్నారు. సింగరేణిలో ఉద్యోగం చేసి పదవి విరమణ పొందిన తర్వాత ఇక్కడ కొందరు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారన్నారు. టవర్ నిర్మాణానికి ఇచ్చిన ఆన్‌లైన్ అనుమతులు రద్దు చేసి సెల్ టవర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో కాలనీ వాసులు రవీందర్, సత్యనారాయణ, జ్యోతి, క్రిష్ణవేణి, రాములు, గురువయ్య, కిష్టయ్య కాలనీ వాసులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

కుంభమేళాను తలపించేలా రజతోత్సవం

- అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



మందమర్రిలో కార్యకర్తలతో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్

మందమర్రి టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న పోరుగడ్డ వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ 25 వసంతాల రజతోత్సవ వేడుక మరో కుంభమేళాను తలపించే విధంగా ఉండబోతుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ తెలిపారు. శనివారం పట్టణంలో బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మార్కెట్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్య వంతులను చేయాలన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. అనంతరం ఆయన జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యకర్తలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ కోల్‌బెల్ట్ రోడ్డు మీదుగా రాష్ట్రీయ రహదారి వరకు కొనసాగింది.

అనంతరం ఆయన జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొంగల తిరుపతిరెడ్డి, డా. రాజా రమేష్, మేడిపల్లి సంపత్, బట్టు రాజ్‌కుమార్, తోట సురేందర్, బోరిగం వెంకటేష్, ఎండి అబ్బాస్, బెల్లం అశోక్, పల్లె నర్సింగ్, రవీందర్, సీపెల్లి సాగర్, ముస్తఫా పాల్గొన్నారు.

అంబేద్కర్ లేకపోతే రాజ్యాంగం లేదు

ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మందమర్రి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ లేకపోతే రాజ్యాంగమే లేదని చెన్నూరు ఎమ్మెల్యే డా. వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో దినశ రణ్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన హాజరయ్యారు. అంబేద్కర్ ఆలోచన సమాజానికి మార్గదర్శకంగా నిలి చాయన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజల సమాన హక్కుల కోసం కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్ అని పేర్కొన్నారు. ఎన్నో అవమానాలను ఎదుర్కొని ఉన్నత చదువులు చదవడంతో పాటు ప్రపంచంలోనే అత్యధిక డిగ్రీలు పొందిన వ్యక్తి కూడ అంబే ద్కర్ అన్నారు. నిరంతరం ప్రజల కోసమే పని చేసిన మేధావి అని పేర్కొన్నారు. ఆయన రాజ్యాంగ ఫలితంగానే అందరికి సమాన హక్కులు వరించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ను సంస్థ సభ్యులు సన్మానించి అ వార్డు ప్రదానం చేశారు.



ఎమ్మెల్యే వివేక్‌కు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు



కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి



మృతి చెందిన చుక్కల దుప్పి

కౌటాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందింది. అటవీ ప్రాంతానికి ఆనుకున్న ఉన్న మండల కేంద్రంలోకి చుక్కల దుప్పి రావడంతో ఊర కుక్కలు దాడి చేశాయి.. తీవ్రంగా గాయపడిన దుప్పిని కొంత మంది యువకులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందింది. అనంతరం అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు.

పోక్సో కేసులో నిందితుడి రిమాండ్

దహెగాం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో అరెస్టు అయిన మండలంలోని ఓ గ్రామానికి చెందిన కామెర హోక్టుకు ఆసిఫాబాద్ కోర్టు జడ్జి 13 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఎస్సై రాజు తెలిపారు. హోక్టు గ్రామానికి చెందిన 11 ఏళ్ల బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించినందుకు బుధవారం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశామని చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరు పరుచడంతో జడ్జి రిమాండ్ విధించారని తెలిపారు.

బాబోయ్ కోతులు



ఆసిఫాబాద్ పట్టణంలో సంచరిస్తున్న కోతులు

- వీధుల్లో వానరాల వీరంగం
- ఇళ్లలోకి చొరబడుతూ ఇబ్బందులు
- భయాందోళనలో ప్రజలు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కోతుల బెడద రోజురోజుకు పెరుగుతోంది. కోతులు గుంపులుగా వెళుతూ కాలనీలపై విరుచుకుపడుతున్నాయి. ఇళ్లు, దుకాణాలలో తిను బండరాలు, వస్తువులను ఎత్తుకెళ్లడంతో పాటు పండ్ల చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. ప్రజలపై దాడులకు దిగుతూ గాయపరుస్తున్నాయి. కోతుల భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కోతుల నియంత్రణలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. నియంత్రణ కోసం చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

గుంపులుగా కాలనీల్లో..

కోతులు గుంపులుగా కాలనీలలో సంచరిస్తూ వీరంగం సృష్టిస్తున్నాయి. అటవీ ప్రాంతాలు రోజురోజుకు తగ్గిపోవడం వాటికి అడవిలో ఆహారం లబించక పోవడంతో గ్రామాల్లోకి చొచ్చుకు వస్తున్నాయి. ఇళ్లలో తయారు చేసుకున్న భోజనలతో పాటు పప్పు దినుసులు పట్టుకెళుతున్నాయి. కిరణా షాపులు, పండ్ల దుకాణాలదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాపులోని వస్తువులకు రక్షణగా జాలీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కోతుల బెడదతో పెంకుటిళ్లలు ధ్వంసం అవుతున్నాయి. అరుబయట ఎండబెట్టిన పప్పు దినుసులు ఇతర ఆహార పదర్థాలను వదలటంలేదు. ఇళ్లలో ఉన్న మామిడి, జామ, బొప్పాయి ఇతర పండ్ల చెట్లు, కూరగాయాల చెట్లను సైతం వదల కుండా ధ్వంసం చేస్తున్నాయి.

ప్రజలపై దాడులు..

ఇళ్లలో చొరబడి వీరంగం సృష్టిస్తున్న కోతులను తరిమే ప్రయత్నంలో అవి ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. కొందరు కోతి కాటుకు గురై ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఇళ్లపై గుంపులుగుంపులుగా ఒక చోట చేరి వచ్చి పోయే వారిపై పైపైకి వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కోతుల బెడద తీవ్రం కావడంతో కొంత మంది టపాసులు, పెద్ద శబ్ధాలు చేసి వాటిని తరిమివేస్తున్నారు. పట్టణంలో కోతుల నియంత్రణ కోసం అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కోతులను బంధించి అటవీ ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. కోతుల వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తుందని వాటి నియంత్రణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించి కోతులబారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

కోతులతో తీవ్ర ఇబ్బందులు..

జ్యోతి, ఆసిఫాబాద్



కోతులతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇళ్లలోకి చొరబడి వస్తువులను చిందర వందరగా పడేసి వీరంగం సృష్టిస్తున్నాయి. పప్పు దినుసులు, ఆహార పదార్థాలు, కూరగాయాలు ఎత్తుకెళుతున్నాయి. వీటిని తరిమేందుకు ప్రయత్నించగా అవి దాడులకు దిగుతున్నాయి. అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోవాలి.

మీద పడి కరుస్తున్నాయి..

చిరంజీవి, ఆసిఫాబాద్



వీధుల్లో నుంచి వెళ్తున్న సమయయంలో కోతులు మీద పడి కరుస్తున్నాయి. కోతుల బెడద రోజురోజుకు తీవ్ర రూపం దాల్చుతోంది. ఇళ్లలోకి వచ్చిన కోతులను తరిమితే దాడులకు పాల్పడుతున్నాయి. కోతుల దాడుల్లో పలువురు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు కోతుల బెడద నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి.



తక్కువ ప్రీమియంతో కుటుంబానికి ధీమా

సతీష్, కాగజ్‌నగర్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: పోస్టల్ ఇన్సూరెన్స్ ద్వారా వినియోగదారులకు కలుగుతున్న ప్రయోజనాలు ఏంటి?

పోస్టల్ ఇన్‌స్పెక్టర్: తపాలా శాఖ ద్వారా కేంద్రం ప్రభుత్వం పలు ఇన్సూరెన్స్ పథకాలు అందిస్తోంది. ముఖ్యంగా తక్కువ ప్రీమియంతో కుటుంబానికి ఎక్కువ ధీమా ఉండే విధంగా బీమా ప్రయోజనం చేకూరుతుంది. 18 నుంచి 65 ఏళ్ల మధ్య ఉన్నవారికి విద్య, ప్రమాద బీమా పాలసీ, ఆసుపత్రి బిల్లుల చెల్లింపు తదితర ప్రయోజనాలు అందిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: ఈ పథకాలపై ప్రజలకు అవగహన కల్పించేందుకు ఏం చర్యలు తీసుకుం టున్నారు?

పోస్టల్ ఇన్‌స్పెక్టర్: ఆయా పథకాల పట్ల తపాలా శాఖ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పరిధిలోని అన్ని మండలాల్లో, బీపీఎంల్లో ప్రచార కార్యక్రమాలతో పాటు అన్ని బ్రాంచి పోస్టాఫీసులు, తదితర కార్యాలయాల్లోనూ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. బీమా పథకాల్లో చేరితే రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు ప్రయోజనం ఉంటుంది. అలాగే అంగవైకల్యం, పెళ్లీడుకు వచ్చిన కుమార్తెలకు కూడా ప్రయోజనకరంగా ఉంటాయి.

ఆంధ్రజ్యోతి: బీమా పథకాలు, ప్రీమియంలపై వినియోగదారులకు మీరిచ్చే సూచనలు ఏంటి?

పోస్టల్ ఇన్‌స్పెక్టర్: ప్రతి ఒక్కరూ బీమా చేయించుకున్నట్లయితే కుటుంబానికి ఆధా రంగా ఉంటుంది. ఏదైనా అనుకోని సంఘటన జరిగిన, లేదా అంగవైకల్యం కలిగినా ఆ యా పథకాల ద్వారా ప్రయోజనాన్ని పొందవచ్చు. ప్రస్తుతం పాత కంపెనీలు ఆదిత్య బిర్లా, స్టార్ హెల్త్, టాటా, నివా, బజాజ్ కంపెనీలతో పాటు ప్రస్తుతం రిలయన్స్ స్టార్ కంపెనీలు పలు పథకాలు అందిస్తున్నాయి.

- కాగజ్‌నగర్ టౌన్, ఆంధ్రజ్యోతి

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి

జైనూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడ వాలని మహారాష్ట్రలోని ముంబయి హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ సత్యపాల్ కాట్కర్ అన్నారు. జైనూర్ మండలంలోని కొండిబాగూడలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ చదువుకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని ఉన్నత విద్య చదివించాలని కోరారు. అంతకు ముందు ముఖ్య అతి థులు అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం లో రిషి వాగ్మారె, కొండిబాగూడ అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబురావ్ జాబాడె, రచయిత మధు బావల్కర్ పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడాలి



మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ కేశవనాథ స్వామి ఆలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. ఆలయానికి 89 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని చెప్పారు. అందులో 83 సర్వేనంబర్‌లో ఉన్న 8.22 ఎకరాల భూమిలో కొందరు అక్రమంగా తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారని తెలిపారు. గతంలో రెవెన్యూ పరిధిలో ఉన్న సమయంలో తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్నవారు ఆలయానికి నిర్ణీత అద్దె చెల్లించాలని ఒప్పందాలు ఉన్నాయని చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఒక్కరు కూడా పైసా చెల్లించడం లేదన్నారు. ఎండో మెంట్ శాఖ అధికారులు ఇప్పటికైనా పూర్తి స్థాయిలో సర్వే చేయించి భూములను కాపాడాలని కోరారు. సమావేశంలో మనోజ్‌కుమార్, సుగుణాకర్, వెంకట్‌రవీందర్, రాజేశ్వర్, నరేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



ఎమ్మెల్సీ దండె విఠల్‌ను సన్మానిస్తున్న గౌడ కులస్తులు

తిర్యాణి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని గీత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. భూ భారతి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం తిర్యాణి మండల గౌడ కులస్తుల ఆహ్వానం మేరకు మండల కేంద్రంలోని రేణుక ఎల్లయ్య ఆలయాన్ని ఎమ్మెల్సీ సందర్శించి మొక్కులు చెల్లించుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గౌడ కులస్తుల బాధలు తనకు తెలుసన్నారు. పొన్నం ప్రభాకర్‌గౌడ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారని, ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి మార్గం దొరుకుతుందని చెప్పారు. ఆలయం అభివృద్ధికి తాను చేయూత నిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు ఎమ్మెల్సీని సన్మానించారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అనిల్‌గౌడ్ అత్తమ్మ మల్లక్క ఆరు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడుఅనిల్‌గౌడ్, గౌడ కులస్తులు శ్రీనివాస్ గౌడ్, శంకర్‌గౌడ్, సాగర్, వెంకటేశంగౌడ్, లచ్చగౌడ్, బాపు, నర్సాగౌడ్, సత్యగౌడ్, బాలేష్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శేషారావు అన్నారు. స్థానికంగా శనివారం ఆయన మాట్లాడారు. ఫిర్యాదుల కోసం వాట్సాప్ నంబరు 7901628348తో పాటు టోల్ ఫ్రీ నంబరు 1912 అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. వినియోగదారులు తమ మొబైల్ నుంచి హాయ్ అని చాట్ చేయగానే టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ కాల్ సెంటర్‌కు స్వాగతం అని వచ్చి అందుబాటులో రిజిస్టర్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ అని వస్తుందని వివరించారు. అందులో రిజిస్టర్ కంప్లైంట్ ఎంటర్ చేయగానే విత్ యూనిక్ సర్వీస్ నంబర్, విత్ అవుట్ యూనియ్ సర్వీస్ నంబర్, ప్రీవియస్ మెనూ వస్తుందని చెప్పారు. ఇలా విత్ యూనిక్ సర్వీస్ సెంటర్ ఎంటర్ చేయగానే విద్యుత్ సర్వీస్ వివరాలు వస్తాయని తెలిపారు. వివరాలను ఒకే చేయగానె కంప్లైంట్‌నకు సంబంధించిన మెనూలో కనపడుతాయని తెలిపారు.

'భూభారతి'తో సమస్యలు పరిష్కారం



రెబ్బనలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న ఎమ్మెల్సీ దండే విఠల్

రెబ్బెన, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టంతో భూ సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారమవుతాయని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న వివిధ భూ సమస్యలు భూ భారతి చట్టంతో పరిష్కారమవుతాయన్నారు. పరిష్కారం కాని సమస్యలకు అప్పీలు విధానం ఉందన్నారు. తహసీల్దార్‌కు భూ సమస్యను పరిష్కరించేందుకు క్షేత్ర స్థాయిలో వెళ్లే అధికారం ఉంటుందన్నారు. ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో రైతుల భూములకు సంబంధించిన కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయని చెప్పారు. పట్టాభూములన్న వాటికి కూడా ప్రభుత్వ భూములు జాబితాలో పడ్డాయని అన్నారు. వీటిన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం నూతన చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రాంమోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మ, ఏవో దిలీప్‌కుమార్‌లతో పాటు ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు సత్వరమే పరిష్కరమవుతాయని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల ఆవరణలో జరిగిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల కోసం కోర్టులను ఆశ్రయించకుండా రెవెన్యూ ఆఫీసర్ల పరిధిలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో మూడు జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేశారని, జిల్లాలో ఒక మండలంలో క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల్లో అప్పీల్ చేసుకోవచ్చన్నారు. రైతులకు మేలు కోసం ప్రజాపాలనలో చారిత్రక మార్పు భూభారతి చట్టం ద్వారా లభిస్తుందన్నారు. రైతులను సమస్యలు అడిగి సమాధానాలు చెప్పారు. సమావేశంలో డీఆర్‌డీవో లోకేష్‌కుమార్, మండల స్పెషల్ ఆఫీసర్, డీటీడీవో రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, ఏవో వినయ్, తహసీల్దార్ సూర్యప్రకాష్, ఎంపీడీవో మల్లేష్, నాయకులు విశ్వప్రసాద్‌రావు, అనీల్‌గౌడ్, సాగర్ పాల్గొన్నారు.



ఉద్యోగులు జాగ్రత్తలు పాటించాలి

మందమర్రి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత పెరిగినందున ఉద్యోగులు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సింగరేణి వైద్యాధికారి లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. కేకే 5 గనిపై వడదెబ్బ తాకకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు ఎండలో తిరగవద్దని, శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. విటమిన్లతో కూడిన పండ్ల రసాలు, నిమ్మరసం సేవించాలని అన్నారు. ఆహార అలవాట్లు మార్పు చేసుకోవాలన్నారు. ఎండలో వెళ్లేటప్పుడు తలకు టోపీ, ముఖానికి గుడ్డ ధరించాలని సూచించారు. గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని తెలిపారు. వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కార్మికులు ఆరోగ్యంగా ఉండి విధులకు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, రమేష్, పర్సనల్ ఆఫీసర్ కార్తిక్, మేనేజ్మెంట్ ట్రైనీ పర్సనల్ రవళి పాల్గొన్నారు.

ఉగ్రవాదుల చర్యలు దారుణం

మందమర్రి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల చర్యలు దారుణమని అధికారులు అన్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం ఏరియాలోని కేకే 5 గనిపై అధికారులు, ఉద్యోగులు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉగ్రవాదులు మతం అడిగి మారణ హోమం సృష్టించడం దారుణమన్నారు. ప్రభుత్వం వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించేందుకు అధికారులు జీఎం కార్యాలయంలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో నలుగురు అధికారి వారి సీనియారిటీ ప్రకారం క్వార్టర్లను ఎంచుకున్నారు. కార్యక్రమంలో కౌన్సెలింగ్ కమిటీ సభ్యులు ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, సివిల్ ఇంజనీర్ సత్యనారాయణ, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఎల్. శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను పెంచాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు(పా) వెంకటేశ్వర్లు

మందమర్రి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరం సంస్థకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల పెంపుదలకు ఉద్యోగులు, అధికారులు అంకితభావంతో పనిచేయాలని డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు (పా) వెంకటేశ్వర్లు అన్నారు. మందమర్రి ఏరియాను శనివారం ఆయన సందర్శించారు. ముందుగా ఏరియాలోని కేకే ఓసీని సందర్శించి ఓబీ పనుల పురోగతిని జీఎం దేవేం దర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తి పని తీరును పరిశీలించారు. ఓసీకి సంబంధించి పనులను పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలో అన్ని గనుల, డిపార్టు మెంట్ల హెచ్‌వోడీలతో నిర్వ హించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్షణతో కూడిన ఉత్పత్తే లక్ష్యమనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. విధుల నిర్వహణలో రక్షణ సూత్రాలు పాటించాలన్నారు. పని ప్రదేశాలను పక్కాగా పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఎస్‌వో టూ జీఎం విజయ్ ప్రసాద్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవిందర్, కేకే 1 గ్రూపు ఏజెంట్ రాంబాబు, ఎస్‌కే గ్రూప ఎండి అబ్దుల్ ఖాధీర్, పర్సనల్ మేనేజర్ శ్యాం సుందర్, కేకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, రాము, ఫారెస్టు అధికారి రమణారెడ్డి, ఎన్విరాన్మెంట్ అధికారి వెంకట్‌రెడ్డి, ఎస్టేట్ అధికారి నవనీత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగుల సమస్యలు పరిష్క రించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో రామగుండం ఏరియాలో డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. వారసత్వ ఉద్యోగాలకు అర్హతను 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచడం సంతోషమే అయినా 4 నెలలుగా నియామకపత్రాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. వెంటనే అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. మే మొదటి వారంలో నియామకపత్రాలు ఇచ్చేందుకు డైరెక్టర్ హామీ ఇచ్చారని సత్తయ్య తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీదర్ రెడ్డి, ఏరియా కార్యదర్శి రాజేందర్, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రాణహిత స్టేడియంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరం శనివారం నుంచి వచ్చే నెల 20 వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

ప్రాణహిత స్టేడియంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను జీఎం శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. తాళ్లపల్లి, సీతారాంపల్లి ఆర్ ఆర్ కాలనీలు, క్వార్టర్లలో నివాసం ఉండే ఉద్యోగుల కుటుంబాల కోసం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.. ఓపెన్ జిమ్ ఏర్పాటుకు సుమారు 5 లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, శ్రీరాంపూర్ గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్లు, డీజీఎం (పర్సనల్) అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

మంథనిరూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మంథని మండలం లక్కేపూర్ గ్రామ శివారులో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన మాసు రమాదేవి (36) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మంథని సీఐ రాజు కథనం ప్రకారం.. శనివారం లక్కేపూర్ శివారులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం కావడంతో విచారణ చేపట్టారు. మృతురాలు మాసు రమాదేవిగా గుర్తించామన్నారు. అయితే రమాదేవి భర్త సత్యనారాయణ మృతదేహాన్ని గుర్తించి తన భార్యను హత్య చేశారని, లక్కేపూర్ గ్రామానికి చెందిన పండుగు మొగిలి పై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అధిక లోడ్‌తో వెళ్తే చర్యలు

కౌటాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వాహనాలు అధిక లోడ్‌తో వెళ్తే చర్యలు తప్పవని ఎంవీఐ మోహన్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీటీవో రాంచంద్రనాయక్ ఆదేశాల మేరకు అధిక లోడ్ వాహనాలపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వాహనదారులు నిబంధనలకు అనుగుణంగా నడిపించాలని సూచించారు. అధిక లోడ్‌తో వెళ్తున్నాయన్న ఫిర్యాదులు చాలా వస్తున్నాయని, ఈ మేరకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వాహనదారులు ప్రమాదాలు జరుగకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రమాదాల నివారణకే తాము తనిఖీ చేస్తున్నామని డీటీవో తెలిపారు.

వైరస్ ద్వారానే గాలికుంటు వ్యాధి వ్యాప్తి

కిరణ్ కుమార్, పశువైద్యుడు, భీమిని



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గాలికుంటు వ్యాధి వైరస్ ద్వారా వస్తుందని పశు వైద్యుడు కిరణ్‌కుమార్ తెలిపారు. వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నట్లు ఆయన ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి : గాలికుంటు వ్యాధి దేనివ లన సోకుతుంది ?

వైద్యుడు : ఈ వ్యాధి వైరస్ వల్ల సోకుతుంది. గాలి ద్వారా ఒక పశువు నుంచి మరొక పశువుకు త్వరగా వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి శ్వాసకోశ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. దీని వల్ల పశువులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడతాయి.. వ్యాధి సోకిన పశువులు మరొక పశు వులకు దూరంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలి.

ఆంధ్రజ్యోతి : మండలంలో గాలికుంటు, నట్టల నివారణ టీకాలను వేస్తున్నారా ?

వైద్యుడు : ఏప్రిల్ 15 నుంచి మే 15 వరకు నెల రోజులు వ్యాధి టీకాలు అందిస్తాం. అదేవిధంగా జీవాలలో పేడ పరీక్షల ద్వారా నట్టల నిర్ధారణ చేసి నట్టలకు సంబంధించి నిక్లోజమైట్ ఆల్బెండజోల్, పెన్‌బెండజోల్, రఫోక్సే జమైట్, ట్రైక్లోబెండజోల్ వంటి మందుల ద్వారా నివారణకు కృషిచేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : రైతులకు గడ్డి విత్తనాలను ఎంత సబ్సిడీపై అందిస్తున్నారు? సబ్సిడీపై పశువులను అందజేస్తున్నారా ?

వైద్యుడు: 75 శాతం సబ్సిడీపై ఎస్ఎస్‌జి 5 కిలోల గడ్డి విత్తనాల బస్తాను రూ. 114 చెల్లిస్తే ఈ విత్తనాలను రైతులకు అందజేస్తున్నాం. వీటి తోపాటు కేంద్ర ప్రభుత్వ నేషన్ లైవ్ స్టోక్ మిషన్ పథకం ద్వారా 50 శాతం సబ్సిడీతో గొర్రెల, మేకల ప్రాజెక్టులు ఉన్నాయి. రైతులు ఈ పథకాలను వినియోగించుకోవాలి.

-భీమిని, (ఆంధ్రజ్యోతి)

కలెక్టర్ చెప్పినా.. ఖాతరు చేయరా..?

"ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందులు పడకూడదు. రైతులు ఇబ్బంది పడితే సహించేది లేదు". ఇది సాక్షాత్తూ కలెక్టర్ కుమార్ దీపక్ చేసిన హెచ్చరికలు. గత సోమవారం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ కోగుగోలు కేంద్రాల నిర్వాహకులను హెచ్చరిస్తూ కొన్ని సూచనలు కూడా చేశారు. కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించినా ఎక్కడా కానరావడం లేదు. ఇక తూకం లోనూ రైతులు మోస పోతున్నారు.



గుల్లకోట గ్రామంలోని కేంద్రంలో మండుటెండలో రైతుల అవస్థలు



● ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మోసం ● ఇబ్బంది పడుతున్నరైతులు ● తూకంలో దండి, కానరాని వసతులు

లక్షెట్టిపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇక్కట్లు మొదలయ్యాయి. రైతులు ప్రభుత్వ మద్దదు ధర పొందేలా జిల్లాలో సుమారు 321 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈఏడాది యాసంగిలో రైతులు పండించిన ధాన్యం కొనేందుకు సర్వం సిద్ధం చేయడంతో పాటు కలెక్టర్, సంబంధిత అధికారుల పర్యవేక్షణ కూడా ముమ్మరంగా కొనసాగుతోంది. ఇంత పకడ్బందీ చర్యలు ప్రభుత్వం తీసుకున్నప్పటికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు పెద్ద ఎత్తున మోసం జరుగుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. కేంద్రం నిర్వాహకులు అధికారుల మాటలను బేఖాతర్ చేస్తూ ఇష్టం వచ్చినట్లు తూకం వేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంచికి సంచి వేసి జోకాలి...

కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40కిలోల ధాన్యం తూకం వేస్తున్న సమయంలో ధాన్యాన్ని గన్ని సంచిలో నింపుతారు. అందుకు గాను సంచికి సంచి వేసి జోకాల్సి ఉంటుంది. మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రం సంచికి సంచి వేయడం మరిచి 40కిలోల వడ్లకు కొన్ని ప్రాంతాల్లో 42కిలోలు మరికొన్ని ప్రాంతాల్లో సుమారుగా 43కిలోల వడ్లను జో కుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

ఇలా జోకడంతో రైతులు క్వింటాలుకు సుమారు 5కిలోల నుంచి 8కిలోల వరకు ధాన్యం నష్టపోవాల్సి వస్తోంది. అంతేకాకుండా కొంత మంది రైతుల కాంట వేసిన బస్తాల మొత్తం నుంచి మిల్లర్ల పేరు చెబుతూ లారీల్లో నింపే సమయంలో మిల్లర్లు వడ్లు బాగు లేవని బస్తాలు దింపుకోవడం లేదని కూడా కేంద్రంలో చెబుతున్నారు. సుమారు 300 బస్తాలు మిల్లుకు పంపిస్తే ఒక్కో చోట పది బస్తాలు, కొన్ని కేంద్రాల్లో సుమారు 9బస్తాల వడ్లను దండి కొడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.

కేంద్రాల్లో వసతుల మాట దేవుడెరుగు..

మండలంలో మొత్తం 19గ్రామాల్లో కలిపి రైతుల సం క్షేమం కోసం 19కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈకేంద్రాలు మొత్తం ఇందిరా క్రాంతి పథకానికి చెందిన మహిళా సంఘాలకు అప్పగించారు. ప్రతీ కేంద్రంలో రైతుల సౌకర్యార్థం అన్ని వసతులు కేంద్రం నిర్వాహకులు కల్పించాలి. కానీ కేంద్రాల్లో అరకొర వసతులతో సరి పెట్టుకుంటున్నారు. ఒకపక్క విపరీతమై ఎండలు కొడుతుండగా ఎక్కడ కూడా టెంట్లు వేసిన ధాఖలు కనిపించడం లేదు. కొన్ని గ్రామాల్లో అసలు కేంద్రం కూడా కనిపించడం లేదు. రైతులు పండించిన ధాన్యంను ఎవరి ఇంటి ముందు వాళ్లే సీసీ రోడ్లపై పోసుకున్నారు. కేంద్రాల వద్ద కూడా ఏదో ఉందా లేదా అన్న ట్లు తూతూ మంత్రంగా చిన్న డేరాలు, గతంలో వేసి ఉన్న గుడారాల్లో నీటి వసతి ఏర్పాటు చేసారు కేంద్రం నిర్వాహకులు.

42కిలోలు జోకుతున్నారు...

కొనుగోలు కేంద్రంలో సంచికి సంచి వేసి తూకం వేయమంటే వినడంలేదు. 40కిలోల సంచికి అదనంగా రెండు కిలోలు పోసి 42కిలోల ధాన్యం జోకుతున్నారు. ఇదేంటి అని కేంద్రాల్లో అడిగితే అలాగే జోకుతాం మా ఇష్టం. మిల్లుల వడ్లు 40కిలోలకు సంచి వేసి కాంట వే స్తే తీసుకుంట లేరు. అధికారులు అలానే చెబుతారు వాళ్ల మాటలు వింటే వడ్లు ఇక్కడే ఉంటాయని అంటున్నారు. ఇక చేసేది లేక అడిగినంత ఇచ్చేయాల్సి వచ్చింది.



చెల్ల రవి, రైతు, సూరారం

తొమ్మిది సంచుల ధాన్యం తీసుకున్నారు

నేను కేంద్రంలో వడ్లు పోస్తే మిల్లర్ల పేరుమీద మూ డు వందల సంచులకు 9సంచులు తరుగు పెట్టిండ్రు. ఇదేంటి అని అడిగితే తూర్పాలు పట్టలేదని మిల్లర్లు కటింగ్ చేసిండ్రు అని అంటుండ్రు. నేను కాంట పెట్టినప్పుడు 40కిలోల తూకానికి పావుదక్క మూడు కిలోలు ధాన్యం ఎక్కువపోసి సుమారు 43కిలోలు జోక్కున్నరు. అవి కాక ఇప్పుడు మళ్లీ 9సంచుల వడ్లు తీసు కున్నరు. ఇట్ల అయితే మాబతు కులు ముందుకు సాగినట్లే. గతి లేక కేంద్రంల అమ్ముకుంటున్నం.



కోడూరి శ్రీకాంత్, రైతు

సంచికి సంచి వేసి జోకాలి...

ప్రతీ కొనుగోలు కేంద్రంలో సంచికి సంచి వేసి జోకాలి ఎక్కువ తూకం వేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటాము. ఇప్పటి వరకు ప్రతీ కేంద్రంలో నిర్వాహకులకు సూచించాం. నిభందనల ప్రకారం తూకం వేయాలని అదే విధంగా కేంద్రాల్లో రైతులకు ప్రభుత్వం సూ చించిన మేరకు అన్ని వసతులు కల్పించాలని చెప్పాము.



విజయలక్ష్మి, ఐకేపీ ఏపీఎం, లక్షెట్టిపేట

రజతోత్సవానికి సిద్ధం..

(5వ పేజీ తరువాయి)

బీఆర్‌ఎస్‌ను వీడి, కాంగ్రెస్‌లో చేరారు. ఆయా నేతలతోపాటు వారి అనుచరగణం కూడా పెద్ద సంఖ్యలో పార్టీని వీడారు. అయితే మంచిర్యాల జిల్లాలో పార్టీ తుడిచిపెట్టుకుపోయినా మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, బాల్క సుమన్, దుర్గం చిన్నయ్యలు పార్టీని అంటిపెట్టుకుని ఉన్నారు.

జిల్లా నుంచి పదివేల మందిని తరలించే యోచన..

వరంగల్ బహిరంగ సభకు జిల్లాలోని మూడు ని యోజక వర్గాల నుంచి పదివేల మంది పార్టీ శ్రేణులను తరలించేందుకు ఆయా నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు సన్నాహాలు చేస్తున్నారు. రజతోత్సవ సభపట్ల కొద్ది రోజులుగా పార్టీ శ్రేణులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. నియోజక వర్గానికి మూడు వేల చొప్పున తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. బహిరంగ సభను విజయవంతం చేయడం ద్వారా జిల్లాలోనూ బీఆర్‌ఎస్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ కూడా తనదైన శైలిలో కృషి చేస్తున్నారు.

ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారు...

బాల్క సుమన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు



వరంగల్ బహిరంగ సభను విజయవంతం చేయడం ద్వారా పార్టీ పూర్వవైభవానికి కృషి చేస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ రెండేళ్ల లోపే ప్రజలు చీత్కారాలు మూటగట్టుకుంటుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఒక్కటి కూడా కాంగ్రెస్ నెరవేర్చలేకపోయింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇప్పటికీ ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

జైపూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరుతూ శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు దూట రాజ్‌కుమార్, నాయకులు ఎంపీడీవో సత్యనారాయణకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో భూమి ఉండి ఇండ్లు కట్టుకోలేని వారికి, ఒంటరి మహి ళలకు, గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇండ్లు కేటాయింపు గురించి నియమించబడిన కమిటీలో గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులను నియమించి ఎలాంటి అవకతవకలు లేకుండా సామాజిక న్యాయ కోణంలో ఇండ్లను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేముల తిరుపతిగౌడ్, చేగొండ శ్రీనివాస్, రామగిరి రాము, చంద్రమౌళి, ప్యాగ మొగిలి పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వ వైభవం తేవాలి

నెన్నెల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కో-కన్వీనర్ మణిరామ్‌సింగ్ అన్నారు. క్రియాశీల కార్యకర్తలకు శనివారం నెన్నెలలో ఐడీ కార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి రూ. 5 లక్షల బీమా సదుపాయం ఉందన్నారు. సింగరేణిలో పరుగు పందెంతో ఉద్యోగాలు కల్పించిన పార్టీ తమదే అన్నారు. ఇప్పటికి టీడీపీకి గ్రామాల్లో వీరాభిమానులు ఉన్నారని పేర్కొన్నారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఠాకూర్ గణేష్‌సింగ్, ఉపాధ్యక్షులు బూకల శంకర్, నాయకులు కొద్దని కిష్టయ్య, మీనుగు చిన్నయ్య, ముస్కె రవి, అబ్బార్ల వెంకటి లక్ష్మి, సువర్ణబాయి, ఉషారాణి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

వేమనపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దస్నాపూర్ గ్రామానికి చెందిన రాకేష్‌గౌడ్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి కింద పడి మృతిచెందగా శనివారం అతని కుటుంబాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మంచిర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, గౌడ సంఘం అధ్యక్షుడు ముకేష్‌గౌడ్ పరామర్శించారు. కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. కొంత ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి అన్ని విధాలుగా సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కిశోర్, సురేష్, బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లు, మురళీదర్, వెంకటేశ్వర్‌రావు, మధుకర్, మదునయ్య, అజయ్, రమేష్‌గౌడ్, సత్యనారాయణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న కొక్కిరాల సురేఖ

నస్పూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నస్పూర్ పట్టణంలోని సీసీసీ కార్నర్, ఫ్లడ్ కాలనీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చడానికి చల్లని మంచి నీటి ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుర్మిళ్ల వేణు, దర్ని మధుకర్, సంపత్ రెడ్డి, యశోద, నాసర్, పూదరి కుమార్, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభకు నగదు బహుమతి

- ఎస్ఐ, కానిస్టేబుల్‌కు డీజీపీ అభినందన



డీజీపీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్ఐ

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన ఎస్ఐ, కానిస్టేబుల్‌కు డీజీపీ జితేందర్ నగదు బహుమతి అందించి, అభినందనలు తెలిపారు. గంజాయి కేసులో ఓ నిందితుడు ఎస్సారెస్పీ కెనాల్‌లో దూకి పారిపోతుండగా రామగుండం కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఎస్ఐ ఉపేందర్ ప్రాణాలకు తెగించి అందులో దూకి నిందితుడిని పట్టుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఎస్ఐ ఉపేందర్‌తో పాటు కానిస్టేబుల్ సంపత్‌కు నగదు బహుమతి అందించారు. డీజీపీ జితేందర్‌తో పాటు నార్కొటిక్స్ ఏడీజీ సందీప్ శాండిల్యలు వారిని ప్రత్యేకంగా అభినందించారు. నగదు రివార్డులు అందుకున్న ఎస్ఐ, కానిస్టేబుల్‌కు రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిశోర్ ఝా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, ఏడీజీ(పర్సనల్) అనిల్, నార్కొటిక్స్ ఎస్పీ రూపేష్ పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతి

మంచిర్యాలక్రైం, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ప్రభుత్వ బీసీ కళాశాల వసతి గృహాల్లో ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బహుమతులు అందజేశారు. హైదరాబాద్‌లోని హరిత ప్లాజా టూరిజం భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నుంచి ప్రభుత్వ బీసీ కళాశాల వసతి గృహం, ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహం మంచిర్యాల ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన గురుళ్ల రవీందర్‌కు, ఎన్. అభినయకు పదివేల ప్రైజ్‌మనితోపాటు మెమొంటును అందజేశారు.

శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

దండేపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం గ్రామంలో శ్రీస్వయంభు శనైశ్వర ఆలయంలో మహాయజ్ఞ మహోత్సవ వేడుకలను వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం చైత్ర త్రయోదశి రోహిణి నక్షత్రం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భానుతేజా స్వామి ఆధ్వర్యంలో అగ్ని ప్రతిష్ఠ, సర్వదేవతా హవనం, నవగ్రహ హోమంతో పాటు శని సహస్రనామ హవనం నిర్వహించారు. ఈవేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

లక్షెట్టిపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ లక్షెట్టిపేట మండల అధ్యక్షుడు మాజీ జడ్పీటీసీ చుంచు చిన్నయ్య శనివారం ప్రకటనలో తెలిపారు.

భీమారం : బీఆర్ఎస్ సభకు తరలిరావాలని బీఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ కలగూర రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటలకు మండల కేంద్రంలో పార్టీజెండా ఆవిష్కరణ ఉంటుందని, అనంతరం చెన్నూరులో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించనున్నారు. అక్కడ నుంచి వరంగల్ సభకు బయలుదేరుతామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

మందమర్రిరూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిర్రకుంట గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల కోసం అధికా రులు సర్వే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి లబ్దిదారుల వివరాలను సేకరించారు. కాంగ్రెస్ నాయకులు గండె రాంచందర్, ఒడ్నాల కొమురయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులకు ఇండ్లు కేటాయిస్తుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మే 4 వ తేదీన జరగనున్న నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో డీసీపీ భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, ఏసీపీ పకాష్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4వ తేదీన జరగనున్న నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో జరగనున్న నీట్ పరీక్షకు 1,204 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, ఇందుకు గాను జిల్లాలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మంచిర్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజీవ్‌నగర్‌లోని ఆదర్శ పాఠశాల, మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ప్రశ్నా పత్రాలను పూర్తి బందోబస్తుతో భద్రపర్చుతామన్నారు. పోలీసుశాఖ బందో బస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిని నియమించాలన్నారు. అభ్యర్థులు సకాలంలో వచ్చేలా ఆర్టీసీ బస్సులు నడిపించాలన్నారు. జిల్లాలో నీట్ పరీక్ష విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రబుత్వ డిగ్రీ కళాశాల చక్రపాణి, కేజీబీవీ ప్రిన్సిపల్ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం మంచిర్యాల జిల్లాలోని ఐకేపీ ధాన్యం సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలకు పింఛన్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్య కల్పించాలన్నారు. అలాగే మే 20 న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో హమాలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఆటో రథయాత్రను విజయవంతం చేయాలి

బెల్లంపల్లి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా ఆటో రథయాత్రను నిర్వహిస్తున్నామని జిల్లా ఆటోయూనియన్ జేఏసీ అధ్యక్షులు కట్ట రాంకుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని ఆటోస్టాండ్ వద్ద కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. జిల్లాలోని బెల్లంపల్లిలో ఈ నెల 30న ఉదయం 10గంటలకు సభ నిర్వహిస్తున్నామని అనంతరం చెన్నూర్‌లో మధ్యాహ్నం ఒంటిగంటకు మంచిర్యాల జిల్లా కేంద్రంలో సాయంత్రం 4గంటలకు సభ ఉంటుందని ఈ సభకు ఆటో డ్రైవర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ఏడాదికి 12వేల రూపాయలు అందిస్తానని మా యమాటలు చెప్పిందని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు ఆటో డ్రైవర్లందరం ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ర్యాలీకి తరలివెళ్లిన నాయకులు

మందమర్రిరూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని గ్రామాల నుంచి శనివారం పట్టణంలో చేపట్టిన బీఆర్ఎస్ బైక్ ర్యా లీకి గ్రామాల నుంచి మాజీ జడ్పీటీసీ వేల్పుల రవి ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. నా యకులు పెంచాల మధు, ఎండీ ఫిరోజ్, కార్య కర్తలు తరలివెళ్లారు.

ప్రతిభ కనబరిస్తే 'ఆదర్శ'లో ప్రవేశం



కోటపల్లిలోని మోడల్ స్కూల్, కళాశాల

కోటపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : అందరికీ చదువు మనందరి బాధ్యత అనే నినాదంతో ఉచితంగా ఆంగ్ల విద్యను అందించేందుకు అప్పటి ప్రభుత్వం 2013-14 విద్యా సంవత్సరంలో ఆదర్శ పాఠశాల వ్యవస్థను నెలకొల్పింది. 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు అధికంగా వచ్చాయి. ఈ నెల 27న ఆయా పాఠశాలల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలోని కోటపల్లి, కాసిపేట, మంచిర్యాల, మందమర్రి, దండేపల్లి మండలం లింగాపూర్‌లలో ఆదర్శ పాఠశాలలున్నాయి. 27న నిర్వహించే ప్రవేశ పరీక్షకు సంబంధించి ఇప్పటికే విద్యార్థులకు హాల్‌టికెట్‌ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుండగా పరీక్ష కేంద్రాల్లోని చీఫ్ సూపరింటెండెంట్లకు శుక్రవారం జిల్లా కేంద్రంలో శిక్షణ ఇచ్చారు.

● నేడు ప్రవేశ పరీక్ష

● జిల్లాలో ఐదు మోడల్ స్కూళ్లు

● స్థానికులకే మొదటి ప్రాధాన్యత

జిల్లాలోని ఐదు మోడల్ స్కూళ్లలో 6వ తరగతిలో 100 సీట్ల చొప్పున, 7 నుంచి 10వ తరగతుల్లో మిగిలిన సీట్లకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా వారి ప్రతిభ ఆధారంగానే ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశం కల్పించనున్నారు. ప్రాధాన్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాల విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. ఇందులో మొదట స్థానికులకే ప్రాధాన్యం ఇస్తూ మిగితా ఖాళీలను స్థానికేతరులకు కేటాయిం చనున్నారు. అంతేకాకుండా కోటపల్లి, కాసిపేట, మంచిర్యాల, మందమర్రి మోడల్ స్కూల్‌లు పీఎంశ్రీ పథకానికి ఎంపిక కావడంతో లక్షల నిధులు మంజూరయ్యాయి.

● పరీక్ష వేళలు

6వతరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉండనుంది. 7,8,9,10 తరగతులకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష కొనసాగుతుంది. ఏ పాఠశాలకు దరఖాస్తు చేసుకున్నారో ఆ పాఠశాలలోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది.

● ఆ రెండు పాఠశాలలకు తీవ్ర పోటీ

జిల్లాలో 5 ఆదర్శ పాఠశాలలు ఉండగా ఇటీవల మందమర్రి పాఠశాలలో సీట్లు పొందేందుకు తీవ్ర పోటీ నెలకొంది. జిల్లాలో ఐదు పాఠశాలలకు సంబంధించి 6వ తరగతిలో 500 సీట్లు ఉండగా 1021 దరఖాస్తులు వచ్చాయి. మంచిర్యాల మోడల్ స్కూల్‌కు 6వ తరగతిలో 100 సీట్లకు గాను అత్యధికంగా 428 దరఖాస్తులు కాగా మందమర్రి మోడల్ స్కూల్‌కు 360 దరఖాస్తులు వచ్చాయి. కోటపల్లిలో వంద దరఖాస్తులు, కాసిపేటలో 67 దరఖాస్తులు, లింగాపూర్ పాఠశాలకు 24 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మంచిర్యాల, మందమర్రి పాఠశాలల్లో పోటీ తీవ్రంగా ఉండగా మిగితా మూడు పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష రాసే ప్రతి విద్యార్థికి సీటు రానుంది. మిగిలిన సీట్లను పాఠశాలలు పునః ప్రారంభమైన తర్వాత ఆఫ్‌లైన్‌లో కేటాయించనున్నారు.

ప్రవేశ పరీక్షకు హాజరు కావాలి

రాజశేఖర్, ప్రిన్సిపల్ కోటపల్లి ఆదర్శ పాఠశాల

ఈ నెల 27న నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులందరు హాజరు కావాలి. పాఠశాలలో ప్రత్యేకంగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు నిరంతర సాధన చేయిస్తున్నాం. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సత్ఫలితాలను సాధిస్తున్నాం.

ఇన్‌చార్జి ఎఫ్ఆర్వోగా శ్రావణ్‌కుమార్


శ్రావణ్‌కుమార్

బెజ్జూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు ఇన్‌చార్జి ఎఫ్ఆర్వోగా శ్రావణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బెజ్జూరు ఎఫ్ఆర్వో ముసవీర్ హజ్‌యాత్రకు వెళ్లడంతో ఆయన స్థానంలో డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

కాగజ్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి, బారెగూడ, ఎస్టీవోస్ గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఎంపీడీవో కోట ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సరీని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా నీరు పట్టాలని చెప్పారు. లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ఉన్నత పాఠశాలకు బెంచీల వితరణ

చింతలమానేపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాసాగర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు సహకారంతో 20 డెస్క్ బెంచీలను బీజేపీ మండల నాయకులు శనివారం అందజేశారు. ఇది వరకే మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బెంచీలను పంపిణీ చేశామని చెప్పారు. మరిన్ని పాఠశాలలకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మల్లయ్య, తుకారాం, మారయ్య, మోహన్, ఆనంద్‌రావు, లచ్చన్న, తిరుపతి పాల్గొన్నారు.

- అధిక ఉష్ణోగ్రతలతో మూగజీవాలకూ ప్రమాదమే
- చల్లటి ప్రాంతాల్లో ఉంచేలా ఏర్పాట్లు చేయాలి
- వడదెబ్బ నుంచి రక్షణ కల్పించాలి



ఎండల వేళ.. పశువులు జాగ్రత్త

ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఎండల తీవ్రత, వడగాలుల కారణంగా పశువులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది. పెంపకందారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు.

బెజ్జూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మనుషులే కాదు మూగజీవాలు కూడా వడదెబ్బకు గురవుతుంటాయి. ఎండలవేళ పశుపోషణలో జాగ్రత్తలు పాటించకపోతే వాటి ప్రాణానికి ప్రమాదమే. యజమానులకు నష్టమే మిగులుతుంది. అధిక ఉష్ణోగ్రతలు, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, పాకల్లో అధిక సంఖ్యలో జీవాలను కిక్కిరిసి ఉంచడం, నీళ్లు అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడదెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి బలహీనంగా మారుతాయి. వాటి చర్మం పొడిబారుతుంది. పశువులు సరిగా నడవలేక తూలుతూ ఉంటాయి. జీవక్రియ తగ్గిపోయి ఆకలి మందగిస్తుంది. దీంతో ఆహారం తక్కువగా తీసుకుంటాయి. పశువులు ఎదకు రాకపోగా చూడికట్టే అవకాశాలు తగ్గిపోతాయి. రోగనిరోదక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు, పరాన్న జీవులు ఆశించే అవకాశం ఉంటుంది. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. ఎండవేడిమికి దాణ సరిగా తినకపోవడం మూలంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. ఎండ నుంచి పశువులను రక్షించుకుంటేనే పాడి పోషణ లాభదాయకంగా ఉంటుంది.

● వడదెబ్బ లక్షణాలు..

వడదెబ్బకు గురైన పశువుల్లో నాలుక బయట పెట్టడం, నీరు తాగకపోవడం, మేత తినకపోవడం, మూత్ర విసర్జన ఆగిపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ముట్టెపై చెమట లేకపోవడం,కళ్లల్లో ఎర్రటి దారలు, నెమరు వేయకపోవడం తదితర లక్షణాలు ఉంటాయి. ఈ లక్షణాలు పశువుల్లో కనిపించిన వెంటనే ఉప్పు, బెల్లం కలిపిన ద్రావణం తాగించాలి. నిత్యం నాలుగైదు సార్లు చల్లని నీటిని తాగించాలి. పశు వైద్యుడి సహాయంతో చికిత్స అందించాలి. అలాగే ఎండా కాలంలో పశువుల్లో వ్యాధి నిరోదక శక్తి తగ్గుతుంది. దీంతో పశువులు సులువుగా జబ్బుల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గొంతు. జబ్బవాపు, గాలికుంటు వంటి వ్యాధులు రాకుండా టీకా ఇప్పించాలి. అంతర, పరాన్న జీవుల నిర్మూళనకు నట్టల మందులు తాగించాలి.

● పాకల్లో చల్లదనం కోసం..

పశువుల పాకల్లో పైకప్పులకు తెల్లరంగు వేసి ఆపై గడ్డి, తాటి, కొబ్బరి వంటి ఆకుల్ని పరచడం లాంటి చర్యల ద్వారా ఎండవేడి షెడ్లలోకి ఎక్కువగా ప్రవేశించకుండా చూడవచ్చు. మధ్యాహ్న సమయంలో పాకల చుట్టూ గోతాలు, పరదాలు వేలాడదీసి తరచు నీటితో తడపడం మంచిది. అత్యధిక పాలిచ్చే సంకరజాతి ఆవులు, ముర్రా గేదెలకు ఫ్యాన్లను ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. పశువుల పాకలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ గాలి దారాళంగా ప్రసరించే విధంగా చూడాలి. పశులును రోజుకు రెండు, మూడుసార్లు చల్లని నీటితో కడగాలి.

జిల్లాలో పశువులు..

ఆవులు	2,94,321
గేదెలు	46,674
గొర్రెలు	1,60,365
మేకలు	2,55,978

● జాగ్రత్తలు పాటించాలి..

వేసవిలో పశువులకు అందించే మేత, దాణాలో జాగ్రత్తలు పాటిస్తేనే పాడిపోషణ లాభదాయకంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మేతకు తీసుకెళ్లాలి. వేసవి తాపంతో పశువుల్లో జీర్ణక్రియ మందగిస్తుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలైన గంజి, జావ లాంటివి అందించాలి. ఎక్కువ శాతం పచ్చిగడ్డి అందించాలి. మాగుడు గడ్డి ఉంటే సంవృద్ధిగా అందించాలి. పచ్చిగడ్డిని ఉదయం, ఎండు గడ్డిని రాత్రి సమయాల్లో కత్తిరించి ఇవ్వాలి. అధిక పాలు ఇచ్చే పశువులకు దాణాలో నీటిని కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మరీ మంచిది. అలాగే పశువుల్లో తాగునీటి అవసరాలు రెట్టింపవుతాయి. చల్లని శుభ్రమైన నీటిని పశువులకు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలి. నీటితొట్లను నీడలో ఉంచాలి. సాధ్యమైనంతవరకు ఎక్కువ నీళ్లు తాగేలా చూడాలి.

పశువులకు చికిత్స చేయించాలి..
- జితేందర్, వెటర్నరీ అసిస్టెంట్, బెజ్జూరు



వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వచ్చే ప్రదేశంలోకి తీసుకెళ్లాలి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు పలుమార్లు నీటితో కడగాలి. చల్లని గోనె సంచిని కప్పడం లాంటివి చేయాలి. పశువైద్యుడి పర్యవేక్షణలో చికిత్స అందించాలి. వైద్యాధికారుల సూచనలు పాటించాలి.

కెరమెరిలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత

ఆసిఫాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో శనివారం అత్యధికంగా 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రెబ్బెన, ఆసిఫాబాద్, తిర్యాణి మండలాల్లో 43.2, సిర్పూర్(టి), కౌటాల మండలాల్లో 43.1, కాగజ్‌నగర్‌లో 42.5, దహెగాంలో 42.4, వాంకిడిలో 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పెంచికలపేట, జైనూర్ మండలాల్లో 41.5, చింతలమానేపల్లిలో 40.7, బెజ్జూరులో 40.6 , సిర్పూర్(యూ)లో 39.6, లింగాపూర్‌లో 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండల తీవ్రతకు ప్రజలు అవస్థలు పడుతున్నారు.

పోడు భూముల వివరాలు అందజేయాలి


మాట్లాడుతున్న కర్జవెల్లి డిప్యూటీ రేంజ్ అధికారి సంతోష్‌కుమార్

బెజ్జూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పోడు భూముల వివరాలు అందించాలని కర్జవెల్లి డిప్యూటీ రేంజ్ అధికారి సంతోష్‌కుమార్ అన్నారు. మండలంలోని కర్జవెల్లి రేంజ్ పరిధిలోని కాటేపల్లి, అంబగట్, కుకుడ గ్రామాల్లో పోడు రైతులతో శనివారం సమావేశాలు నిర్వహించారు. 2006 నుంచి 2022 వరకు సాగు చేస్తున్న పోడు రైతులకు ప్రభుత్వం పట్టాలిచ్చిందన్నారు. హక్కు పత్రాలు ఉన్న రైతులు ఆధార్ కార్డు, తదితర వివరాలతో రెండు రోజుల్లో అటవీ శాఖాధికారులు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ శుక్రు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన ఏఎస్పీ

వాంకిడి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను ఏఎస్పీ చిత్తరంజన్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిసెప్షన్, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. వాంకిడి పోలీసు సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సై ప్రశాంత్‌కు పలు సూచనలు చేశారు. ఎళ్లవేళలా ఫిర్యాదులు స్వీకరించడం, బాధితుల ఫిర్యాదుపై సత్వరం స్పందించి సేవలు అందించాలని చెప్పారు. వాంకిడి మండలంలో సీసీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో చెట్లు నాటారు. ఆయన వెంట సీఐ సత్యనారాయణ ఉన్నారు.

పిల్లల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయాలి

వాంకిడి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల ఎత్తు, బరువులు తీసి వారి ఆరోగ్య స్థితిని అంచనా వేసి సామ్, మామ్ పిల్లలను గుర్తించి నివేదికలు సమర్పించాలని జిల్లా సంక్షేమాధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. మండలంలోని బాబాసాగర్ రైతువేదికలో శనివారం అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సామ్, మామ్ ద్వారా బలహీన చిన్నారులను గుర్తించాలన్నారు. అలాంటి వారికి అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌషికా హారాన్ని అందించి వారి ఆరోగ్య స్థితిని మెరుగు పర్చాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పోషన్ అభియాన్ కో ఆర్డినేటర్ గోపాల్‌కృష్ణ, సూపర్‌వైజర్ భారతి, కుమారి, లత, తౌఫిక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం

రెబ్బెన, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గోలేటి శ్రీ భీమన్న స్టేడియం మైదానంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని శనివారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం విజయ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 రోజుల పాటు శిబిరం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్ఓటు జీఎం కె.రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఇన్‌చార్జి పీవో జెశంకర్, సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

దహెగాం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న ఫోన్‌ను గుర్తించి శనివారం బాధుతుడికి ఎస్సై రాజు అందజేశారు. మండలంలోని మొట్లగూడ గ్రామానికి చెందిన పదిరే రాజన్న కొద్ది రోజుల క్రితం ఫోన్ పోగొట్టుకుని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై రాజు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను ట్రేస్ చేసి బాధితుడికి శనివారం అంద జేశారు.

ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభం


సిర్పూర్(టి)కి వచ్చిన మహారాష్ట్ర బస్సు

సిర్పూర్(టి), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి మహారాష్ట్ర ఆర్టీసీకి సంబంధించిన బస్సు శనివారం ప్రారంభమైంది. సిర్పూర్(టి) నుంచి రాజురా వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉంటుందని సిబ్బంది తెలిపారు.

బూరెపల్లిలో గ్రామస్థుల ఆందోళన


ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరెపల్లి గ్రామంలో అటవీ శాఖాధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని శనివారం వారి వైఖరిని రోడ్డుపై ఆందోళన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ గ్రామంలో రోడ్డు పనులు చేపట్టడానికి అనుమతులు లేవని అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారని చెప్పారు. అటవీ శాఖాధికారులు ఊర్లో రోడ్లు, ఇళ్లు, బోర్లు వేయవద్దని ప్రజలను హెచ్చరిస్తున్నారని వాపోయారు. శనివారం అటవీ శాఖాధికారుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. వెంటనే గ్రామప్రజల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని గ్రామస్థులు హెచ్చరించారు.

● సంక్షిప్తం..

● ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం అంబలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఉబెద్ బీన్ యాహియా, మున్సిపల్ కమీషనర్ భుజంగరావు, సభ్యులు వెంకటేశ్వర్లు, శంకర్, విశాల్, ముబషీర్, ఇమ్రాన్, అబ్దుల్లా, మేరాజ్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

● కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగెపల్లి గ్రామ పంచాయతీలో వివిధ దశలలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను శనివారం ఎంపీడీవో పరిశీలించారు అనంతరం మండలంలోని తలోడి గ్రామంలో శనివారం ఎంపీడీవో పర్యటించారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సేవలను ప్రయాణికులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. ఆర్టీసీ యాప్‌ల ద్వారా అందిస్తున్న అత్యాధునిక సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో శనివారం డిపో మేనేజర్ రాజశేఖర్ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీకి క్యూఆర్ కోడ్ స్కానర్‌తో కూడిన ప్రత్యేక కీ చైన్ అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఆర్టీసీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చింతలమానేపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం దేవానందం అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సిబ్బంది మధుకర్, సంతోష్, స్వప్న పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి


లబ్ధిదారుల వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

వాంకిడి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులకు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. వాంకిడి మండలంలోని చిన్న వాంకిడిలో ఇందిర మ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు వివరాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టి పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వం సూచించిన నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం చేపడితే బిల్లులు త్వరగా వస్తాయని తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్మిస్తున్న నమూనా గృహాన్ని పరిశీలించారు. నమూనా గృహం త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీలో ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వివరాలను కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కార్యదర్శి శివకుమార్‌ను ఆదేశించారు. మండలంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శైలేందర్, మిషన్ భగీరథ ఏఈని ఆదేశించారు. ఆయన వెంట డీపీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రియాజ్ అలీ, ఏఈలు తదితరులు ఉన్నారు.

'నీట్' పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మే 4న ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)కు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. న్యూఢిల్లీ నుంచి దేశంలోని అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ఎస్పీలు, ఉన్నతాధికారులతో అర్హత ప్రవేశ పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్ ద్వారా శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రతినిధి మాట్లాడుతూ జాతీయ అర్హత ప్రవేశ పరీక్షలను పూర్తి భద్రత నడుమ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. మే 4న ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ అర్హత పరీక్ష కేంద్రాలలో పూర్తి ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మే 4న నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని చెప్పారు. పరీక్ష నిర్వహణకు జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలో అర్హత ప్రవేశ పరీక్షకు 287 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షను పూర్తి బందో బస్తు మధ్య నిర్వహించనున్నామని చెప్పారు. పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తాగునీరు. విద్యుత్, సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రశ్నాపత్రాల తరలింపునకు బందో బస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నామని తెలిపారు. సమావేశంలో పరీక్షా కేంద్రం సమన్వయకర్త లక్ష్మీనర్సింహా, కలెక్టరేట్ పర్యవేక్షకుడు శశిధర్ పాల్గొన్నారు.